మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం..

- వనపర్తి జిల్లాలో 5మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు

రైస్ మిల్లులలో చీఫ్ విజిలెన్స్ అధికారి కల్నల్ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు

వనపర్తి టౌన్,పాన్‌గల్,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : వనపర్తి జిల్లాలో 2021నుండి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని ఎఎఫ్‌సీఐకి ఇవ్వడంతో రైస్ మిల్లుల యజమానులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గత నెలలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సీఎంఆర్ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో అనేక లొసుగులు బయట పడ్డాయి. ఫలితంగా జిల్లా పౌర సరఫరాల అధికారి బదిలీ అయ్యారు. అదే సమయంలో రైస్ మిల్ అసోసియేషన్,రైస్ మిల్లర్లతో పలుమార్లు సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ గడువులోగా ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితంగా రైస్ మిల్లర్ల నుంచి గతనెలలో ఒక్కసారిగా బియ్యం అప్పగించేప్రక్రియ ఊపందుకుంది. గతయేడాది డిసెంబర్ 31 నాటికి ఎఫ్‌సిఐకు ఇవ్వాల్సిన బియ్యం 3570 ఏసీకేలు ఉండగా జనవరి మాసము 940ఏసీకేలు అందించారు.ఇంకాస్త ప్రయత్నం చేస్తే ఫిబ్రవరి,29నాటికి ఎఫ్‌సిఐ ఇవ్వాల్సిన మొత్తం బియ్యాన్ని ఇచ్చేయవచ్చు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని అయిదు రైస్ మిల్లులలో చీఫ్ విజిలెన్స్ అధికారి కల్నల్ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామ పరిధిలోని ఇషాన్ ట్రేడర్, పాన్‌గల్ మండలం మహమ్మదాపూర్ లో మీనాక్షి ఫుడ్ ప్రొడక్షన్, వనపర్తి పట్టణంలో కేదరనాథ్ రైస్ మిల్, పాన్‌గల్ మండల పరిధిలోని ఇషాన్ ఆగ్రో, పరమేశ్వర రైస్ మిల్లులపై గత నెలలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కేసులు బుక్ చేశారు. కేంద్ర ఆహార సంస్థకు బియ్యం చేసి ఇవ్వడానికి ఇచ్చిన వరి బస్తాలు సకాలంలో ఇవ్వకపోవడమే కాకుండా అధికారులు పరిశీలించగా ఇచ్చిన వరి బస్తాలకు నిల్వ ఉన్న బస్తాల మధ్య తేడా ఉన్నట్లు గుర్తించారు. సుమారు 2,25,179 వరి ధాన్యం బస్తాల లోటు ఉన్నట్లు గుర్తించి కేసులు బుక్ చేశారు. ఇందుకు ఒప్పుకోని రైస్ మిల్ యజమాని పరమేశ్వర రెడ్డి అడ్వకేట్ కౌన్సిల్‌ను ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిసింది. ఈవిషయం తెలుసుకున్న రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ ప్రధాన విజిలెన్స్ అధికారి ప్రకాశ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని పంపించి ఫిబ్రవరి 10 నుండి రైస్ మిల్లుల తనిఖీలు ప్రారంభించారు. ధాన్యం బస్తాల నిల్వలు లెక్కిస్తున్నారు. తనిఖీల అనంతరం తుది నివేదిక రావాల్సి ఉందని సివిల్ సప్లై జిల్లా అధికారి శ్రీనాథ్ తెలిపారు.

అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి11 ప్రభాతవార్త:జిల్లాపరిధిలో దొంగతనాలు నిర్మూలన గురించి పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరిగిందని గ్రామాలలో పట్టణకేంద్రాలలో కాలనీలలో ఎవరైనా కొత్తవ్యక్తులు వచ్చిన అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూం నం.8712670399కి,లేదా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లపరిధిలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ పెంచడం జరిగిందని పెట్రోకార్ పెట్రోలింగ్,బ్లూ కోట్స్ పెట్రోలింగ్,అలాగే మఫ్టీలో పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.దొంగతనాల నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలుతీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అలాగే పాతనేరస్తులపై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఎవరైనా గ్రామాలలో ఎక్కువ రోజులు ఇండ్లకు తాళంవేసి టూర్లు లేదా బంధువుల ఊర్లకు వెళ్లినచో సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయా ఏరియాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. గ్రామాలలో ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు చేయడానికి భయపడతారని, అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని ప్రతి గ్రామంలో ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కోరారు.

న్యాయ యాత్రకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, పలువురు నేతలు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపడుతున్న పాలమూరు న్యాయయాత్ర షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూర్ మండలంలో ఆదివారం కొనసాగింది. న్యాయయాత్రకు సంఘీభావంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, తాలూకా కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్, అలీలు పాల్గొని సంఘీభావం తెలిపారు. న్యాయయాత్ర చేపడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. అనంతరం కొత్తూర్ మండలంలో కొనసాగిన న్యాయయాత్రలో పాల్గొన్నారు.

ఆయకట్టుకు కోయిల్‌సాగర్ నీటిసరఫరా నిలిపివేత..

25.3ఫీట్లకు తగ్గిన నీటిమట్టం



దేవరకద్ర, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి ఆయకట్టుకు నీటిసరఫరాను నిలిపివేశారు.గత కొన్ని రోజులుగా ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నారు.అయితే సమయ సూచిక ప్రకారం ఆయకుట్టుకు నీటిని నిలిపివేశారు. ఆయకట్టుకు నీటిని సరపరా చేస్తుండటంతో ప్రాజెక్టులో 25.3ఫీట్లకు తగ్గింది. ఆయకట్టుకు నీటిసరఫరా చేస్తుండ టంతో ప్రాజెక్టు పరిదిలోని దేవరకద్ర,మరికల్,ధన్వాడ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు వ్యవసాయపనుల్లో బిజీగా ఉన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌ను లాక్కెళ్లి..

పల్లీ కుప్పలపై తోసేసి..

- అచ్చంపేటలో అన్నదాత కన్నెర

- వేరుశనగకు మద్దతు ధర కల్పించాలంటూ ఆందోళన

- లింగాల చౌరస్తాలో రైతుల నిరసన, ధర్నా

వేరుశనగ కుప్పలపై చైర్మన్‌ను తోసేసి నిరసన తెలుపుతున్న మహిళా రైతులు

వేరుశనగ కుప్పల వద్దకు చైర్మన్‌ను లాక్కెళ్తున్న మహిళా రైతులు

చైర్మన్‌పై విరుచుకుపడుతున్న మహిళా రైతు

మార్కెట్ యార్డ్‌కు భారీగా తరలివచ్చిన వేరుశనగ

అచ్చంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:ఆరుగాలం చెమటోడ్చి రాత్రి పగలు తేడా లేకుండా శ్రమనంతా దారపోసి వ్యవసాయాన్ని సాగు చేస్తూ పండించిన పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్తే రైతన్నలకు పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో నిరాశే మిగులుతోంది. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన రైతన్న బ్రతుకు మాత్రం మారడం లేదు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం కొనసాగిస్తూ ప్రపంచానికే మూడు పూటల బువ్వ పెడుతున్న కర్షకుల కళ్లలో దళారులు పాలకులతో కుమ్మక్కై ప్రతినిత్యం రైతన్న పొట్ట కొడుతున్నారని చెప్పుకోవచ్చు. వ్యవసాయాన్ని సాగు చేసేందుకు భూమినే నమ్ముకొని ఉన్న రైతన్నలు ఆ భూమినే తాకట్టు పెట్టి ఎన్నో అప్పులు చేసి పంటలను సాగు చేస్తే పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తారనే ఆశతో ఉన్న రైతన్నలకు పంట చేతికి రాగానే దళారుల రూపంలో కొంత మంది మోసం చేస్తుంటే మరో ప్రక్క పాలకులు దళారులకే మద్దతు తెలుపుతూ రైతన్న పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని తనువు చాలించిన రోజులెన్నో. నిష్పక్షపాతంగా భూమినే నమ్ముకొని నిజాయితీగా బ్రతుకున్న రైతన్నకు మాత్రం ప్రతినిత్యం ఎన్నో ఇబ్బందులు, నిరాశలే ఎదురవుతున్నాయి. రైతన్న పొట్ట కొడుతూ దర్జాగా పెద్ద పెద్ద కారులో తిరుగుతున్న దళారులకు మాత్రం ప్రతినిత్యం సకల సౌకర్యాలు కలుగుతున్నాయని చెప్పుకోవచ్చు. రైతన్నను మోసం చేస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకులతో కుమ్మక్కైన దళారులను ఉన్నత పాలక వర్గాలు, ఉన్నతాధికారులు మాత్రం ఏ నాడు కూడా రైతన్న పక్షాన నిలబడి మేమున్నామని భరోసాను కల్పించిన దాఖలాలు లేవు. ఎన్నికలకు ముందు తాము గద్దెనెక్కేందుకు మాత్రం ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ రైతన్నకు అండగా ఉంటామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రసంగాలు చేస్తున్నారే తప్ప గద్దెనెక్కిన తర్వాత రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఎందుకు సుముఖత చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతన్న చేసిన పాపమేమిటి. వ్యవసాయాన్ని నమ్ముకొని పంటలను తమ పిల్లల వలే సాగు చేస్తూ జీవనం గడపడమే వారు చేసిన పాపమంటూ పలువురు వాపోతున్నారు. రైతన్న పంటలను సాగు చేసేందుకు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయం నుంచి పంట చేతికొచ్చి విక్రయించే వరకు వ్యాపారస్తులు, దళారుల చేతుల్లో మోసపోకతప్పడం లేదని చెప్పుకోవచ్చు. రైతన్నలు సాగు చేసి పండించిన వేరుశనగ పంటను విక్రయించేందుకు అచ్చంపేట నడిబొడ్డున ఉన్న వ్యవసాయ మార్కెట్ గోదామ్‌కు తీసుకొచ్చారు. వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు మద్దతు ధర కల్పించకపోవడం వల్ల వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించాలని రైతులు గత మూడు రోజుల క్రితం కార్యాలయం ముందు ధర్నా, నిరసన చేపట్టారు. అధికారుల కోరిక మేరకు రైతులు ధర్నాను విరమింపజేశారు. ఆదివారం భారీ ఎత్తున వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగను విక్రయించేందుకు రైతులు తమ పంటలను తీసుకొచ్చారు. పంటలకు మద్దతు ధర కల్పించకపోవడం వల్ల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయిన కూడా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ స్పందించకపోవడంతో కోపోగ్రస్తులకు గురైన రైతులు మద్దతు ధర కల్పించాలంటూ ధర్నా నిరసనకు దిగారు. మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరలు వేరుశనగ ఎక్కువ ధర రూ.7060, తక్కువ ధర రూ.4816లు ఉండగా, మోడల్ ధర రూ.6510, వచ్చిన రైతులు 709 మంది రావడంతో మద్దతు ధర కల్పించడం లేదని రైతన్నలు కోపోగ్రస్తులయ్యారు. దీంతో అక్కడే ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణను మద్దతు ధర కల్పించాలని కోరుతూ డిమాండ్ చేశారు. మహిళా రైతులు కోపాన్ని కట్టలు తెంచుకొని మద్దతు ధర కల్పించాలంటూ చైర్మన్ అరుణపై దాడికి పాల్పడ్డారు. మద్దతు ధర కల్పించకపోతే చెప్పులతో కొడుతామని మహిళా రైతు తీవ్ర ఆక్రందనతో చైర్మన్‌పై విరుచుకుపడింది. దీంతో ఆగకుండా చైర్మన్ అరుణను పల్లీ కుప్పలపై తోసివేసి వేరుశనగ పంటను ఆమెపై వెదజల్లి నిరసన తెలిపారు. రైతులంటే చిన్న చూపా అంటూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని, రైతన్నలు ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో రైతన్నల ఆవేశం తారా స్థాయికి చేరుకుంది. అచ్చంపేట పట్టణంలోని లింగాల చౌరస్తా వరకు చైర్మన్ అరుణను లాక్కెళ్లి చౌరస్తాలో కూర్చొబెట్టి ఆమె చూట్టు రైతులందరు కూర్చొని వేరుశనగ పంటకు మద్దతు కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆదివారం నిర్వహించిన టెండర్లను రద్దు చేసి సోమవారం షెడ్యూల్ నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డ్ అధికారులు ప్రకటించడంతో రైతులు పోలీసుల మాటకు కట్టుబడి ధర్నా, నిరసనను విరమించారు. రైతులు తమ వేరుశనగ పంట రాశుల వద్ద కాపలాగా ఉండి రక్షించుకోవాలని పోలీసులు రైతులకు సూచనలు జారీ చేశారు.

బూచోళ్లు..

- పోలీసులకు సవాల్‌గా మారిన పిల్లల అపహరణ
- మల్దకల్‌లో ఇద్దరికి దేహశుద్ధి
- పలు చోట్ల సీసీ కెమెరాల్లో గుర్తింపు
- భయాందోళనలో తల్లిదండ్రులు
- నిజామాబాద్ జిల్లా తర్వాత పాలమూరులో ఘటనలు

మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : చిన్నపిల్లల అపహరించడం ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టిస్తున్నాయి. జడ్చర్ల, మల్దకల్, మహబూబ్‌నగర్ ఇలా ఒకటి తర్వాత ఒకటి వరుసగా ఘటనలు చోటుచేసుకోవడంతో పిల్లల తల్లిదండ్రులను భయాందోళనకు గురిచేస్తున్నది. అయితే కిడ్నాప్‌కు గురైన వారు ఐదారేండ్లలోపు వారే ఉండడం చర్చనీయాంశంగా మారింది. అయితే జడ్చర్లలోని క్లబ్ రోడ్డులో జరిగిన ఘటనలో తెలిసిన వారే కావాలని చేసి ఉంటారని పోలీసులు

మన్యంకొండ వద్ద పట్టుబడ్డ దుండగులు

ఇటీవల మల్దకల్‌లో దుండగులను గుర్తించి దేహశుద్ధి చేసిన స్థానికులు

అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు అపహరణకు యత్నించినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మల్దకల్ మండలం దశమికట్ట ప్రాంతంలో ఓ చిన్నారిని అపహరించడంతో గుర్తించిన స్థానికులు దుండగులకు దేహశుద్ధి చేశారు. మొన్న మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలోనూ చికిత్సకోసం వచ్చిన దంపతుల నుంచి పసిబిడ్డను అపహరించడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఇలా సంఘటనలు జరుగుతుండడంతో డబ్బుల కోసం చేస్తున్నారా.. కుటుంబ సభ్యులు కావాలనే చేస్తున్నారా.. లేదా ఏవరైనా ముఠా సభ్యులు చేస్తున్నారా అనే పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచినట్లు పోలీసులు చెబుతున్నారు.

చిన్నపిల్లలే టార్గెట్

సోషల్ మీడియాలో వైరల్..

చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నట్లు ఓముఠా వారు సంచరిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా కొంతకాలంగా వార్తలు రావడం ఆందోళన కలిగిస్తున్నది. దీంతో జనాలు ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రులు భయాందో ళనకు గురవు తున్నారు. అయితే ఆ వార్తలను బలపరిచేలా ఒకటి రెండు సంఘటనలు జరగడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. సామాజిక మాధ్యమా ల్లోనూ వార్తలు తరచూ వైరల్ కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయ పడుతున్నారు. అయితే పోలీస్ యంత్రాంగం కూడా అప్రమత్తమై నిఘా పెంచింది.

మన్యంకొండ స్టేజీ వద్ద..

మన్యంకొండస్టేజీ వద్ద చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సభ్యులని భావించి ఇద్దరిని ఆదివారం స్థానికులు పట్టుకున్నారు.అయితే గతకొంతకాలంగా ముఠా సభ్యులు తిరుగుతున్నట్లు వార్తలు వస్తుండడంతో గమనించిన స్థానికులు ముందే అప్రమత్తమయ్యారు. అనుమానంగా కొత్తవారు కనిపిం చడంతో చిన్నిపిల్లలను ఎత్తుకెళ్లే ముఠాగా గుర్తించారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు

జిల్లాలో పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాలు తిరుగుతున్నట్లు ఎలాంటి సమాచారం లేదు. మహబూబ్‌నరగ్ దవాఖాన ఆవరణలో పసిబిడ్డను ఎత్తుకెళ్లిన ఘటనలో కేసు నమోదు చేశాం. స్పెషల్ టీంలు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల్లో నిఘా పెంచాం. ఎక్కడా కూడా అనుమానితులు ట్రేస్ కాలేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

- మహేశ్, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ఘటన 1

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని దశిమికట్ట ప్రాంతంలో ఇద్దరు దుండగులు వచ్చి ఓ చిన్నారిని తాగడానికి నీళ్లు అడిగారు. ఆ చిన్నారి నీళ్లు తేవడంతో మాయమాటలు చెప్పి దుప్పటికప్పి పొదల్లోకి తీసుకెళ్లారు. గమనించిన స్థానికులు ఇద్దరికి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సమయానికి స్థానికులు గుర్తించారు కాబట్టి ప్రమాదం తప్పింది. చిన్నారి క్షేమంగా తల్లిదండ్రులకు చెంతకు చేరింది.

ఘటన 2

మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో నాలుగు రోజుల కిందట పసిపాపతో చికిత్స కోసం వచ్చారు. అయితే వారు తెల్లవారుజాము కావడంతో దవాఖాన ఆవరణలోని ఓ షెడ్డులో కాసేపు నిద్రకు ఉపక్రమించారు. తెల్లారక లేచి చూస్తే పసిబిడ్డ లేకపోవడంతో లబోదిబోమంటూ ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పాపను అపహరించినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దవాఖానలో ఆవరణలో సీసీ కెమెరాల్లో చూసినప్పటికీ ఎలాంటి ఫలితం దక్కలేదు.

ఘటన 3

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో క్లబ్ రోడ్డులో ఓ పాపను కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. అయితే తెలిసిన వాళ్లే చేసి ఉంటారని డబ్బుల కోసం ఆ పని చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

బిఆర్ఎస్ భూస్థాపితం..!

వేల ఉపాధ్యాయ ఖాళీలున్న భర్తీ చేయలేదు

కాంగ్రెస్ పార్టీ ప్రజాసంక్షేమం కోసమే పని చేస్తుంది

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేరిన మహబూబ్‌నగర్ కౌన్సిలర్లు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి,వేదికపై ఎమ్మెల్యే జిఎంఆర్

మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాలులో బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు శంకర్, యాదయ్య,నారాయణ, వెంకటయ్య, నాయకులు స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ భవిష్యత్తులో ఇక బిఆర్ఎస్ పార్టీ ఉండదని, బిఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతున్న పార్టీ అని ఆయన అన్నారు. పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్ల మహబూబ్‌నగర్ ప్రజలు ఎన్నో విధాలుగా నష్టపోయామని, విద్య, వైద్యం పూర్తిగా సంక్షోభంలో పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా నింపలేదని, గురుకులాల పేరున విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన మండిపడ్డారు. మొన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం విద్య వైద్యమే కాదు, అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణాన్ని అందరం కలిసి అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో నాయకులు కమిషన్లకు కక్కుర్తిపడి, లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు కడితే, మేడిపండు చూడ అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బిఆర్ఎస్ పార్టీదని, ఆ పార్టీ నాయకుడిదే అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నలుగురి ఉద్యోగాలు ఊడగొట్టినందుకు, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో నలుగురి ఉద్యోగాలు ఊడగొట్టినందుకు, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. ఎలాంటి భేషజాలకు పోకుండా మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కొత్త, పాత అనే విషయాన్ని మరిచిపోవాలని, అందరు కలిసి మెలిసి పార్టీని బలోపేతం చేసేందుకు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. మన జిల్లా అదృష్టం మన జిల్లా బిడ్డ మన ముఖ్య మంత్రి కావడం వల్ల జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పి వెంకటేష్, మాజీ మహిళ అధ్యక్షురాలు బెక్కరి అనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, చంద్రకుమార్‌గౌడ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్,అజ్మత్ అలీ, అవేస్, జహీర్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, శంకర్, వెంకటేష్‌గౌడ్, నారాయణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం అందించిన ఎంపిటిసి నీలి లక్ష్మి శ్రీనివాసులు

ఇటిక్యాల ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: మండల పరిధిలోని ధర్మవరం పంచాయితీ పరిధిలో గల బి.వెం.గన్న పల్లె, గ్రామానికి చెందిన బోయ మధు అనే యువకుడు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చేరుకుని మృతి చెందిన మధు భౌతికకాయానికి నివాళుల ర్పించి వారి కుటుంబాన్ని ప్రగాఢ సంతాపం తెలిపి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఏఐసీసీ కార్యదర్శి , అలంపూరు మాజీ శాసనసభ్యులు సంపత్‌కుమార్, ఆదేశాల మేరకు ఆ కుటుంబానికి ఎర్రవల్లి ఎంపీటీసీ, నీలి లక్ష్మి శ్రీనివాసులు 10 వేల రూపాయల, ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వెంకటేశ్ యాదవ్, సర్పంచు మధునాయుడు, ఉపసర్పంచు ముని గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువరాజు, వెంకటేశ్, బజారన్న నాయుడు, తదితరులు పరామర్శించడం జరిగింది.

వీపనగండ్ల ఎస్సైగా నందికార్..

నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో

వీపనగండ్ల ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: వీపనగండ్ల ఎస్సైగా నందికర్ పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన రవి ప్రకాశ్ బదిలీ కాగా ఆయన స్థానంలో నూతనంగా ఆదివారం నాడు స్టేషన్ బాధ్యతలు తీసుకున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తున్న విషయం తెలిసిందే అందులో భాగంగానే మండల అధికారులను మార్చి నూతన అధికారులను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అదే విధంగా మండల ఎంపీడీవో గా పనిచేసిన కథలప్పను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేసినట్లు సమాచారం ఆయనతో పాటు తహసీల్దార్ వరలక్ష్మి కూడా బదిలీ అవుతున్నట్లు తెలుస్తుంది.

ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్ష

వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 5వ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ షకీలా సుల్తానా మాట్లాడుతూ 240 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గాను 219 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 91.2శాతం విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడుదాం...

వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గౌడ కులస్తుల తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేసి సాధించుకుందామని గౌడ సంక్షేమ సంఘం నాయకులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బాలస్వామిగౌడ్, మట్ట వెంకటయ్యగౌడ్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎవీఆర్ గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను తాలూకా అధ్యక్షులు చుక్క అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ్స్ రాజకీయాల్లో రాణించాలని, పార్టీలను ప్రక్కన పెట్టి గౌడ సోదరులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, నాయకులు బాలస్వామిగౌడ్, నర్సింహ్మగౌడ్, సదానందంగౌడ్, వెంకటేష్‌గౌడ్, రుక్కుల్‌గౌడ్, పర్వతాలుగౌడ్, మట్ట విష్ణుగౌడ్, సాయిబాబు, భరత్‌గౌడ్, మదన్‌గౌడ్, నాగర్జునగౌడ్ తదితరులు ఉన్నారు.

సంతు సేవాలాల్ జయంతికి

ఐచ్చిక సెలవు ప్రకటించడం 3హర్షనీయం..

వెల్దండ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఈ నెల 15న ప్రభుత్వం ఐచ్చిక సెలవుగా ప్రకటించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పీసీసీ ఉపాధ్యక్షులు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో ఐక్యత కార్యాలయంలో గిరిజన సోదరులు రమేష్‌నాయక్, పంతుల నాయక్‌లతో కలిసి సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంతు సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించిన పెడచెవిన పెట్టారు తప్ప సెలవు దినంగా ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 60 రోజుల్లోనే గిరిజనుల న్యాయమైన కోరికను సీఎం రేవంత్‌రెడ్డి తీర్చారన్నారు. సమావేశంలో లక్ష్మణ్‌నాయక్, జయరాం నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రతాప్ కౌటిల్యాకు డాక్టరేట్ ప్రధానం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీడీపీసీ మెంబర్, రిటైర్డు అధ్యాపకులు ప్రతాప్ కౌటిల్యాకు గ్లోబల్ ఉమెన్ పీస్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వెంకటేష్, చైన్నై భారతీయ విద్యా భవన్‌లో సైన్స్‌లో చేసిన కృషికి ప్రతాప్ కౌటిల్యాకు శనివారం గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ కౌటిల్యాను అభినందిస్తూ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ బాబు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్‌రాజేందర్‌సింగ్, జాతీయ పోషకాహారం సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భానుప్రకాష్‌రెడ్డిలతో పాటు పలువురు డాక్టరేట్ ప్రధాన గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.

కాండంతో పురుగు నివారణపై అవగాహన

బిజినేపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : ప్రస్తుతం వరిలో ఉత్పత్తిని తగ్గించే చీడ పీడల్లో ప్రధానమైన కాండం తొలుచు పురుగు నివారణతో రైతులు జీవులను పొందవచ్చని రావేప్ విద్యార్థులు సూచించారు. ప్రొ॥ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆదివారం మంగనూరులో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కాండంతో పురుగు నివారణ కోసం తొలిదశలోనే ఎండుగడ్డి రంగులో ఉన్న రెక్కల పురుగు దాని గుడ్ల సముదాయాన్ని గుర్తించవచ్చని చెప్పారు. వరి పంటలో గుర్తించలేని విధంగా ఉన్నట్లయితే ఒక ఎకరానికి మూడు లేదా నాలుగు లింగాకర్షణ బుట్టలు అమర్చి ఒక బుట్టకు వారానికి 25 నుండి 30 మగ రెక్కల పురుగులు కనిపిస్తే సస్యరక్షణ చర్యల చేపట్టాలన్నారు. దీని నివారణ కోసం నత్రజని శాతం అందించే విధంగా యూరియా తర్వాతి దశలో క్లోరిఫైరిఫాస్ కార్‌టాప్ హైడ్రో క్లోరైడ్ వంటి వాటిని వాడాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిహారిక, ప్రణయ, వైష్ణవి, నివేదిత, వైష్ణవిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు

మన్యంకొండలో కన్నులపండువలా తిరుచ్చిసేవ..!

-అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారి దర్శనం

మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

మన్యంకొండలో అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారు

దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూదేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ,ఈఒ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానంద చారి,సిబ్బంది శ్రీకాంత్,సుదర్శన్,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదల తిరుమల పాలెం వెంకన్న..!

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు, 14న శ్రీవారి కళ్యాణం
16న రథోత్సవం, 17న ఉద్దాల మహోత్సవం

పాలెం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్లో) వెంకటేశ్వరస్వామి విగ్రహం

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాలెం ఒకటి. అలువేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందింది. తిరుపతికి వెళ్లలేని భక్తుల కోసం స్వామి ఇక్కడ కొలువై ఉన్నాడని పెద్దలు చెబుతుంటారు. బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమై 18 వరకు జరగనున్నాయి. పాలెం బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టాలు కళ్యాణోత్సవం 14న, స్వామివారి రథోత్సవం 16న, ఉద్దాల మహోత్సవం 17న జరుగుతాయని ఆలయ ఈఒ సిహెచ్ రంగారావు తెలిపారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు...

11న స్వామివారికి అభిషేక, కొయిలల్వార్, తిరుమంజసం, నిత్యారధన,సాయంత్రం అంకురార్పణ,రుత్వీకరణం,నిత్యారాధన మత్స్యంగ్రహణం, హంసవాహనసేవ, 12న హోమ బలిహరణాదులు, ధ్వజారోహణం, భేరిపూజ, హనుమద్వాహనసేవ, 13న నిత్యారాధరనలు, గరుడ వాహనసేవ, స్వామి,అమ్మవార్ల ఎదుర్కోళ్లు, 14న కళ్యాణోత్సవం, సాయంత్రం గజవాహనసేవ, 15న నిత్యారాధన, పల్లకిసేవ, 16న సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు, రాత్రి పది గంటలకు శ్రీవారి రథోత్సవం (తేరు),17న నిత్యారాధనలు, అశ్వవాహనసేవ, 18న సప్తావరణములు, శేషవాహనసేవ, దేవతా విసర్జన, ద్వాదశారాధనలు, పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు ఉంటాయి.

ఆలయ చరిత్ర...

పాలెం గ్రామ నిర్మాత తోటపల్లి సుబ్రమణ్యశర్మ 1961లో గ్రామస్తులైన రెడ్డి రెడ్డి లోహిత్‌రెడ్డి కేటాయించిన 13 ఎకరాల భూమిలో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. వ్యాపారవేత్తల రామలింగయ్య, బాలింగయ్యల సహకారంతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని తిరుపతిలోని పాపనాశనం వద్ద రూపకల్పన చేయించారు. తిరుపతిలో వెలసిన శ్రీవారిలా ఉండడంతో పాటు అక్కడ పూజలు అందుకున్నందుకు పాలెం వెంకన్న దేవాలయానికి రెండో తిరుపతి అనే పేరు వచ్చింది. 1948లో అలువేలు మంగ విగ్రహాన్ని రాయచోటిలో రూపకల్పన చేయించి అమ్మవారి గర్భగుడి నిర్మాణం చేసి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. దేవాలయం అభివృద్ధితో పాటు దాతల సహకారంతో ముఖమండపం, ధర్మసూత్రాలు, నీటి కొలనులను నిర్మించారు. ఆలయానికి వచ్చిన ఆదాయన్ని గ్రామంలో విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేశారు. 1973లో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆలయ ఆవరణలో కళ్యాణ మండపాన్ని నిర్మించారు. 1976లో ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంది.

సంత్ సేవా లాల్ సంఘం జిల్లా నూతన కమిటీ ఎంపిక..

జిల్లా కమిటీ నూతన అధ్యక్షులుగా ఎం.చంద్రునాయక్,ప్రధాన కార్యదర్శిగా వి.రాధాకృష్ణ నాయక్

సంత్ సేవా లాల్ నూతన సంఘం అధ్యక్షులు చంద్రు నాయక్,ప్రధాన కార్యదర్శి గా రాధా కృష్ణ

వనపర్తి టౌన్,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : వనపర్తి జిల్లా సంత్ సేవా లాల్ నూతన సంఘంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా సంఘం అధ్యక్షులుగా చంద్రు నాయక్,ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణను ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు.సంఘం కోశాధికారిగా రాజకుమార్ నాయక్,అధ్యక్షులుగా సూర్యనాయక్,కృష్ణానాయక్,ఉపాధ్యక్షులుగా కస్సా నాయక్, నారాయణ నాయక్,కృష్ణ నాయక్,జహంగీర్,జానకిరామ్ నాయక్,శంకర తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గత 8 సంవత్సరాలుగా జత్రునాయక్ అధ్యక్షతన సేవా సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహించినందుకు కృతజ్ఞతలను కొత్త కమిటీ సభ్యులు తెలిపారు.కొత్త అధ్యక్షులు చంద్రు నాయక్ మాట్లాడుతూ ఈ నెల 15 వ తేదీన సంత్ సేవలాల్ భోగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.తరతరాలుగా బంజారా జాతిపై రాజకీయంగా అణచివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు.అణిచివేత ఎదుర్కొంటూ రాజకీయంగా, ఆర్థికంగా తమ ఎదగాలని,జాతి అభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ శంకర్‌నాయక్,మాజీ జెడ్పిటీసీ బస్తి రామ్ నాయక్ గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అర్జున్ నాయక్,ఉద్యోగ సంఘ నాయకులు జయరాం నాయక్,లక్ష్మణ్ నాయక్,శంకర నాయక్,విద్యార్థి సంఘ నాయకులు శివనాయక్ గిరిజన యువకులు విద్యార్థి సంఘ నాయకులు యువజన సంఘం నాయకులు ఉద్యోగస్తులు మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు వనపర్తి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం

- సాంప్రదాయరీతిలో కుంకుమార్చన,అభిషేకాలు

వాసవిమాత ఆలయంతో కుంకుమార్చర పూజలు నిర్వహిస్తున్న మహిళాభక్తులు

దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ప్రతి ఏడాది దేవస్థానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరిదేవి దేవస్థానంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని అర్చకుడు హరిశంకర్‌శర్మ అధ్వర్యంలో దేవస్థానంలో అచారం ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కుంకుమార్చన, లలిత సహస్రనామపారాయణం తదితర పూజా కార్యక్రమాలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారి ప్రసాదన్నైవేధ్యాన్ని భక్తులకు అందజేశారు.విశేషదినోత్సవం సందర్భంగా అమ్మవారిన రకరకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాలలో దేవస్థానం చైర్మెన్ కల్వకన్నయ్యశెట్టితో పాటు ఆర్యవైశ్య మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

15 నుండి లక్ష్మీచెన్నకేశవస్వామిస్వామి బ్రహ్మోత్సవాలు..

-16న కళ్యాణమహోత్సవం -17న రథోత్సవం

దేవరకద్రలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం (ఇన్‌సెట్లో) అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామివారు

దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: దేవరకద్రలోని శ్రీ లక్ష్మీ లక్ష్మీచెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుండి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు.అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లుచేశారు.దీనికిగాను దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వామి వారి విశేషోత్సవాలు..

దేవరకద్రలోని శ్రీ లక్ష్మీ లక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల విశేషోత్సవాలు ఈ విధంగా ఉన్నాయి. ఉత్సవాల మొదటిరోజు ఈ నెల 15న స్వామి వారి సన్నిధిలో పుణ్యాహవచనంతో ఉత్సవాలకు శ్రీకారం చుడుతారు. అలాగే అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 16న మూలమూర్తికి విశేషపర పంచామృతాభిషేకం,దేవస్థానం ముందున్న పచ్చని పదిరిలో స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. అఖండభజన కార్యక్రమాన్ని కూడ నిర్వహిస్తారు. 17న తెల్లవారుజామున స్వామి వారి మహారథోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగే మహాభిషేకం,అన్నసంతర్పణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు కృష్ణాచారి,శ్రీనివాసచారి,ప్రాణేశ్‌చారి,సంజీవచారి,నిర్వహకులు తెలిపారు. కావున పట్టణం ప్రజలు, భక్తులు, ఈ పూజా కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవీ ఆత్మార్పణ దినోత్సవం..

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో హాజరైన పలువురు నేతలు

కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:కల్వకుర్తి పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో శ్రీ వాసవీమాత కన్యకాపరమేశ్వరి దేవీ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారాయణం, పల్లకి సేవ, కుంకుమార్చన, అగ్నిగుండ కార్యక్రమాలతో హోమ కార్యక్రమాలను అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నాయకులు కలిమిచెర్ల రమేష్, జగదీశ్వర్, మేడిశెట్టి శ్రీధర్, ఉప్పు ఆంజనేయులు, మిర్యాల రాజయ్య, శ్రీధర్, కృష్ణయ్య, విజయభాస్కర్, చిదెర శ్రీనివాసులు, అశోక్, మోహన్, పాపిశెట్టి శ్రీను, ప్రవీణ్, బాలకృష్ణ, గోవిందు కృష్ణయ్య, శ్రీను, నరసింహా, నరసింహస్వామి, మోహన్, మహిళా సంఘాలు, అనుబంధ సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాస్తుపూజలో మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: దేవరకద్రలో ఆదివారం జరిగిన కోఆప్షన్ సభ్యుడు ఖదీర్ నూతన గృహవాస్తుపూజ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్,దేవరకద్ర పీఏసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి,నాయకులు కొండారెడ్డి,దొబ్బలి అంజనేయులు,చల్మారెడ్డి,హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలి

సీసీ రోడ్డు దేవాలయము నిర్మాణానికి
భూమిపూజ చేసిన గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరిత

మల్దకల్ ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గద్వాల్ జిల్లా మల్దకల్ మండలకేంద్రంలో 40లక్షలతో ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి తిమ్మప్ప దేవాలయంవరకు సిసిరోడ్డు నిర్మాణ పనులకు గద్వాలజిల్లా పరిషత్‌చైర్మన్ సరిత భూమిపూజ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణపనులు నాణ్యతగా ఉండాలని దేవాలయానికి భక్తుల రద్దు ఎక్కువ ఉన్న కారణంగా పనులను త్వరగా పూర్తిచేసి నాణ్యతలో ఎక్కడ కూడా వెనక్కి తగ్గకుండా నిర్మాణం చేపట్టి ప్రజల మన్నులు పొందాలని గుతేదారునికి సూచించారు.

శ్రీతిమ్మప్ప స్వామిని దర్శించుకున్న ఎస్సై

మల్దకల్ ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మల్దకల్ మండల ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న సురేష్ గౌడ్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయాలు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి స్వామి వారి చరిత్ర వినిపించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

గోపాలపేట ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గోపాలపేట మండలంలోని పొలికేపాడు గ్రామంలో ఆదివారం బాల్మియా గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటనను వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి వెళ్లడం జరిగింది. దీంతో ఇరు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సత్యశిలారెడ్డి రోజు నీ కుటుంబాన్ని పరామర్శించారు. మృతి చెందిన బాల్మియా మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే మెగారెడ్డి ఆర్థికసహాయం అందజేశారు. 5 వేల రూపాయలను మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కార్యకర్తలు ఉన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేద్దాం

గోరిగడ్డ తండా సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటి ఛైర్మన్ నేనావత్ సంతోష్‌నాయక్

ప్రధాన కార్యదర్శి నేనావత్ వీరేందర్ నాయక్‌ల పిలుపు

బాలానగర్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జయప్రదం చేద్దామని గోరిగడ్డ తండా సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటి ఛైర్మన్ నేనావత్ సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శి నేనావత్ విరెందర్ నాయక్‌లు పిలుపునిచ్చారు. కార్యక్రమంనిర్వహణ కమిటిఛైర్మన్, ప్రధాన కార్యదర్శిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ సేవాలాల్ మహరాజ్285వ జయంతి సందర్భంగా గోరిగడ్డ తండా సేవాలాల్ మహరాజ్ గుడి దగ్గర ఉదయం మహాభోగ్‌బండార్ సేవాలాల్ చిత్రపటంతో ఊరేగింపు,అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా గ్రామస్తులు సేవాలాల్ మహరాజ్ భక్తులు చుట్టుపక్కల గ్రామాల అభిమానులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

స్నేహితుడి భార్యకు ఆర్థిక సహాయం

వీపనగండ్ల,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన సంజన్న బైకు ప్రమాదంలో ఇటీవల మరణించడం జరిగింది.ఆయన కుటుంబానికి 1996,97 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు చిన్ననాటి మిత్రుని జ్ఞాపకాలను స్మరించుకుంటూ...బాధితుని కుటుంబ సభ్యులకు 66 వేల ఐదు వందలు ఆర్థిక సాయం అందజేసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.భవిష్యత్తులో తోటి మిత్రుని కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలవకుండా తమ వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు వవా రు తెలిపారు.కుటుంబ సభ్యులకు 66,500 ఆర్థిక సాయం అందజేసి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో నాగేష్ నందు రాజా రాముడు మద్దిలేటి కృష్ణయ్య ఈశ్వరయ్య బీరయ్య తిరుప తయ్య పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానాన్ని డివైఎస్ఓ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఉదయం పరిశీలించారు. చిన్నారులు ఆడుకునే ఆట స్థలాన్ని శిథిలావస్థలో ఉన్న బాలికల హాస్టల్ భవనాన్ని, నూతనంగా నిర్మిస్తున్న వాలీబాల్ అకాడమి హాస్టల్ భవనాన్ని, ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్ అలీ, సుధాకర్‌రెడ్డి, ఫయీమ్, ఇండోర్ స్టేడియం నిర్వాహకులు పర్వేజ్, అజ్మత్, చెన్నయ్య పాల్గొన్నారు.

పలు శుభకార్యక్రమాలలో పాల్గొన్న మాజీ మంత్రులు

వనపర్తి టౌన్,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త: బి.ఆర్.యస్ నాయకులు ఫజల్ మరియు గౌరీదేవిపల్లి, నారాయణ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమములో నిరంజన్ రెడ్డి,రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని ఆశీర్వాదించారు.కొడేరు రఘు కుమారై వివాహానికి హాజరై వదువరులను నిరంజన్ రెడ్డి ఆశీర్వాధించారు.వజ్ర మోటార్స్ ప్రారంభించిన మాజీ మంత్రి నిరంజన్ బి.ఆర్.యస్ సీనియర్ నాయకులు వాజ్రా.సాయిబాబా కుమారుడు దీక్షిత్ ఆహ్వానం మేరకు ఎలక్ట్రిక్ స్కూటర్ షో రూం ప్రారంభించారు.కాలుష్య నివారణ కోసం ఎలక్ట్రిక్ వాహనాలు దోహద పడతాయని ప్రోత్సహించాలని అన్నారు. నిరంజన్ రెడ్డి వెంట మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,కౌన్సిలర్ సుమధ్,సయ్యద్.జిమీల్,ప్రేమ్ నాథ్ రెడ్డి,వినోద్,వంశీ,శివ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

బిజినేపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : పాలెం గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బాలాజీ నిత్య అన్నదానసత్రంలో అమ్మవారికి అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ గంధం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైశ్యులందరు వాసవి కన్యకా పరమేశ్వరిని వైశ్య కుల దేవతగా తలచి పూజలు చేయడం మొదలు పెట్టాలని, వాసవి జీవిత చరిత్ర అహింసను నమ్మినందుకు, మత విశ్వాసాన్ని నిలిపినందుకు, స్త్రీల ఆత్మగౌరవాన్ని నిలిపినందుకు శాశ్వతంగా చరిత్రలో నిలిచి పోయిందన్నారు. వైశ్యుల కీర్తిని విశ్వ వ్యాప్తంగా వ్యాపించినందుకు ఆమె ఎప్పటికి అజరామరం అయిందన్నారు. ప్రాపంచిక సుఖాలను విస్మరించిన ఆమె వైశ్యుల మనసులలో ఒక విజేతగా, శాంతికి చిహ్నంగా ఎప్పటికి నిలిచిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో పాలెం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ కొత్త బాలరాజు, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కోశాధికారి రాఘవేందర్, సలహాదారుడు రామకృష్ణ, శివకుమార్, కిరణ్, సంతోష్, దేవేందర్, ఆనంద్, శ్రీనివాసులు, మెడికల్ షాప్ శేఖర్ తదితర ఆర్యవైశ్య సోదరీ సోదరమణులు పూజా కార్యక్రమం నిర్వహించారు.

కరెంట్ షాక్ కొట్టి రైతు మృతి

రేవల్లి,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన దొడ్డి నిరంజన్ (59) అనే రైతు కరెంటు షాక్ కొట్టి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది ఎస్సై తిరుపతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగపూర్ గ్రామానికి చెందిన దొడ్డి నిరంజన్ అనే రైతు తన సొంత పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాడు పంట కాపుకు రావడంతో పందుల కావలి నిమిత్తం పొలం దగ్గర కావలి వెళ్లాడు ఉదయాన్నే తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుమారుడు వెంకటేష్ పొలం దగ్గరికి వెళ్ళాడు పంట పొలంలో చనిపోయిన తండ్రి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించాడు.తన పంట పొలంలోనే ఉన్న రేకుల గదికి విద్యుత్ కనెక్షన్ తన పొలంలో ఉన్న బోరు దగ్గర గల స్టార్టర్ బాక్స్ నుండి ఇచ్చాడని బల్బు వెలగకపోవడంతో అదే తీగ పరిశీలిస్తూ వెళ్లి మధ్యలో ఉన్న వైరు జాయింట్ దగ్గర చేయి పెట్టడంతో విద్యుత్ షాక్ తగలడంతో నిరంజన్ చనిపోయి ఉంటాడని గ్రామస్తులు అంచనా వేస్తున్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కొరకై రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కొడుకు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపారు.

ప్రతి క్రీడాకారుడు గెలువాలనే లక్ష్యంతో ముందుకు సాగాలి...

-జిల్లా క్రీడల అధికారి సీతారాంనాయక్

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:ప్రతి క్రీడాకారులు గెలువాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా క్రీడల అధికారి సీతారాంనాయక్ పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కల్వకుర్తి క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో 135 మంది పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16నుంచి 19వరకు సూర్యపేట జిల్లా చింతలపా లెం జరుగుతున్న 33వరాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షులు వెంకటేశ్వ ర్లుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మేకల శ్రీనివాసులు, జేఏసీ కన్వీనర్ సదానందంగౌడ్, పలువురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు

రేవల్లి,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త : మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామ శివారులో గల పెట్రోల్ బంక్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఎస్సై తెలిపారు.ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగపూర్ గ్రామానికి చెందిన తలారి బాలరాజు అరుణమ్మ ఇద్దరు దంపతులు రోజు కూలి పనికి వెళ్లే వారు వారు శనివారం గుడిపల్లి గ్రామానికి వేరుశనగ పట్టడానికి ట్రాక్టర్ క్రషర్ కు కూలి పనికి వెళ్లారు తిరిగి సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంటికి వస్తున్నప్పుడు వారికి ఎదురుగా వస్తున్న రేవల్లి గ్రామానికి చెందిన నూకం భాస్కర్ అనే వ్యక్తి బొలెరో వాహనం తో వేగంగా వచ్చి క్రషర్ పై ఒక పక్కకు కూర్చున్న ఇద్దరు దంపతులకు తగిలించాడు చుట్టుపక్కల ఉన్న వారు వారిద్దరిని వెంటనే నాగర్కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు అక్కడి నుండి హైదరాబాద్ నీమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు ఆదివారం ఉదయం తలారి బాలరాజు మేనమామ నాగనూల్ గ్రామవాసి వెంకటయ్య రేవల్లి మండల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బిజినేపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : శ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, కోయిల్ అల్వార్, తిరుమంజసం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి చైతన్య కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి భాగవత పద్య పఠనం పోటీలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం విశ్వక్సేన ఆరాధన స్వస్తి పుణ్యాహవాచనం రుత్విగ్రహణం, అంకురార్పణ, రక్షాబంధనం, ప్రబంధ పారాయణం, హంసవాహనసేవ తీర్థ ప్రసాద వితరణ భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జున్నాశేఖర్‌రెడ్డి, ఈఓ సిహెచ్ రంగారావు, ధర్మకర్తలు రెడ్డి నారాయణరెడ్డి, గంధం నికిత సురెందర్, సొప్పరి బాలస్వామి, పెద్ద కురుమయ్య, గోవింద వెంకటమ్మ, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక..

అభినందించిన జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య

మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి చాటాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మహబూబ్‌నగర్ జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సీనియర్ బాలుర, బాలికల జట్ల ఎంపికకు సంబంధించి కోడుగల్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన జట్లను కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాయని తెలిపారు. ఈ మేరకు ఎంపికైన క్రీడాకారులకు జడ్పీ వైస్ ఛైర్మన్ అభినందనలు తెలిపారు. మాజీ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘము అధ్యక్షుడు నిరంజన్, మాజీ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షులు తాఖీదు, అన్వర్, కోట్ల యాదయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు..!

- ఊపందుకొన్న పనులు

- 19 నుండి మన్యంకొండ ప్రారంభం -రథోత్సవం 24న

- మార్చి 23న అలిలేలుమంగతాయారు ఉత్సవాలు ప్రారంభం

- అమ్మవారి కళ్యాణమహోత్సవం మార్చి 25న

దేవరకద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: జిల్లాలోని పేరెన్నికగన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరగుతున్నాయి.ఈ నెల బ్రహ్మోత్సవాలు 19 నుండి ప్రారంభం కానున్నాయి.26 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవాన్ని 24న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం మహారాజ గోపురానికి వెల్లవేసే పనులు జరుగుతున్నాయి.ఉత్సవాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్ని భద్రత ఏర్పాట్లుకూడ చేస్తున్నారు. ఘాట్‌రోడ్డు ప్రక్కనున్న ప్రహరి వద్ద కిందికి పడిపోయిన రాళ్ళకు మరమ్మతులు చేస్తున్నారు.దేవస్థానం పరిసరాలు,ఘాట్ రోడ్డుకు ఇరుపక్కలున్న ప్రహరిగోడలకు జాజు పట్టెలు పెడుతున్నారు.తేరు మైదానం వద్ద వాహనాలను నిలపడానికి స్థలాన్ని కూడ చదును చేస్తున్నారు. పరసరాలను శుభ్రపరుస్తున్నారు.దేవస్థానం అధికారులు. చైర్మెన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మహారాజగోపురానికి వెల్లవేస్తున్న కూలీలు

ఉత్సవాలలో ప్రతిరోజు ఒక సేవ..

మన్యంకొండ ఉత్సవాల సందర్భంగా ఉత్సవాలలో ప్రతి రోజు రాత్రి దేవస్థానంలో ఓ సేవ చొప్పున నిర్వహించనున్నారు.తిరుచ్చిసేవతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.అలాగే 20న హంసవాహనసేవ,21న గజవాహనసేవ,22న సూర్యప్రభవాహనసేవ,23న హనుమవాహనసేవ,24న గరుడవాహనసేవ,అర్ధరాత్రి రథోత్సవం, 25న అశ్వవాహనసేవ,ద్వితీయ ప్రభోత్సవం,26న స్వామి వారి దర్బారువాహనసేవ,మార్చి 2న శేషవాహనసేవ,8న మహాశివరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మార్చి 23న అలిలేలుమంగతాయారు ఉత్సవాలు ప్రారంభం

దేవస్థానం దిగువకొండ వద్ద కొలువుదీరిన శ్రీ అలిలేలుమంగతాయారు అమ్మవారి ఉత్సవాలను మార్చి 23 నుండి 27వరకు నిర్వహించాలని నిర్ణయించారు.ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన అమ్మవారి తిరుకళ్యాణమహోత్సవాన్ని మార్చి 25న మధ్యాహ్నం 12లకు నిర్వహించనున్నారు.ఉత్సవాల మొదటి రోజు అమ్మవారి సన్నిధిలో అంకురార్పణం పూజా కార్యక్రమంతో అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.అలాగే 24న ధ్వజారోహణం,దేవతాఆహ్వా నం,26న అశ్వవాహనసేవ,27న పూర్ణాహుతి,వసంతోత్సవం పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్‌తో పాటు అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజులు కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా వెల్టూర్ వైన్స్ నిర్వహణ..

- యజమానులతో ఎక్సైజ్ అధికారుల కుమ్మక్కు

ఉప్పునుంతల,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : అచ్చంపేట నియోజకవర్గంలోని హైదరాబాద్, శ్రీశైలం ప్రధానిరహదారిలో నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపు కొసాగుతుంది.తెల్కపల్లి ఎక్సైజ్‌శాఖ పరిధిలోని ఉప్పునుంతల మండలంలోని వెల్టూరు గ్రామంలో నేషనల్ హైవేకు అతి సమీపంలో వైన్‌షాపు నడిపిస్తున్నారు.తెల్కపల్లి ఎక్సైజ్‌అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేయించి ఉన్నత అధికారులకు అందజేశారు. శ్రీశైలం హైవేలో ఉన్న వెల్టూరు స్టేజీ నుంచి ఈరట్వాన్‌పల్లి గ్రామానికి వెళ్లే దారిని వారి నివేదికలో అందజేసినట్లు తెలిసింది. నేషనల్ హైవేకు 500మీటర్ల దూరంగా ఉండాల్సిన వైన్‌షాపు నేషనల్ హైవేకు అతి సమీపంలో ఉంది. తెల్కపల్లి ఎక్సైజ్ అధికారులు అన్ని నిబంధనలు పాటిస్తామని చెప్పినప్పటికి, ఈ వైన్స్‌షాపు పట్ల ఎందుకు నిబంధనలు పాటించడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైన్స్ యజమానులతో తెల్కపల్లి ఎక్సైజ్ అధికా రులు భారీ ఎత్తున కానులు అందుకున్నట్లు అనుమానాలకు తావిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడానికి కొంత మంది సన్నద్ధమయ్యారు.

శ్రీశైలం, హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో నడుస్తున్న వైన్‌షాప్

మార్కెట్ కమిటీ మహిళా చైర్మన్‌పై దాడి అమానుషం...

-ఆర్యవైశ్య మహాసభ జిల్లా సంఘం తరుపున తీవ్ర ఖండన

అచ్చంపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:అచ్చంపేట పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేసిన రైతులు సమస్యను పరిష్కరించుకునే విధంగా సమస్యను మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణతో వివరించి కుదరకపోతే ఎమ్మెల్యేతో చర్చించి సమస్యలు పరిష్కరించుకోవాలి కానీ మహిళా అని చూడకుండా దాడి చేయడం అమానుషమని ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రజా ప్రతినిధి మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై విచక్షణంగా, అవమానపరిచే విధంగా ఈడ్చుకెళ్తూ దాడి చేయడాన్ని ప్రజాస్వామికమా అని ఆయన ప్రశ్నించారు. రైతుల కోసమే వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లను ఏర్పాటు చేశారని, రైతుల పక్షాన నిలబడి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకే మార్కెట్ యార్డ్‌లు ఉన్నాయని, అలాంటి హోదాలో ఉన్న మహిళా చైర్మన్‌పై అమానుషంగా దాడి చేసి అవమానపర్చడమేమిటని ఆయన ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తదుపరి కార్యచరణకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో మాట్లాడి చర్యలు చేపడుతామన్నారు. రాష్ట్ర విద్యాకమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి విసనకర్రల చంద్రకుమార్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలు పాపిశెట్టి సౌజన్య, అచ్చంపేట అధ్యక్షులు లక్ష్మినారాయణ, జిల్లా సెక్రటరి కలిమిచెర్ల రమేష్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వినోద్, గార్లపాటి శ్రీనివాస్, వంగూరు, వెల్దండ మండలాల అధ్యక్షులు మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, పీఆర్ఓ మిర్యాల రాజయ్యలు మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.

బీఎస్పీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బొదిగల శ్రీనివాస్

సన్మానించిన బీఎస్పీ జిల్లా, అసెంబ్లీ కమిటి నాయకులు

బొదిగల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : బహుజన సమాజ్ పార్టీ మక్తల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి పాలెం వెంకటయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా బొదిగల శ్రీనివాస్ ఎన్నికైన సందర్భంగా మక్తల్ అసెంబ్లీ కమిటి నాయకులు మండల కమిటి నాయకులు జిల్లా కమిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బొదిగల శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో నన్ను జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర కమిటికి కృతజ్ఞతలు తెలుపుతూ బీఎస్పీ ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ అగ్రవర్ణ పేద ప్రజల ఆర్థిక,సామాజిక, రాజకీయ సమానత్వానికై బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా మహా పురుషులు మహాత్మా జ్యోతిరావుపూలె డా. బిఆర్ అంబేద్కర్ మాన్యవర్ కాన్షిరాం ఆశయాల కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని బహుజన పేద ప్రజల కోసం వారి సమస్యల కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు చేయాలని ప్రతి నాయకుడికి కార్యకర్తకు అండగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పార్టీ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి అర్జున్‌రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జట్ల నరెందర్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండారి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి కర్కు బసవరాజ్, మక్తల్ మండలాధ్యక్షుడు పరశురాం, కృష్ణ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, ఉట్కూర్ మండల సీనియర్ నాయకులు గౌతమ్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలు మెచ్చే విధంగా బడ్జెట్ ..

కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి

కొత్తకోట ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: తెలంగాణ బడ్జెట్ కేటాయింపులు తెలంగాణ ప్రజలు మెచ్చే విధంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి అన్నారు. 2,75,891 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వం మోసపూరితమైన బడ్జెట్ ప్రవేశపెట్టి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఈ బడ్జెట్‌లో 6 గ్యారెంటీలకు 53,196 కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పటికే రెండు అమలు చేస్తూ మరో రెండు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ఈ ప్రభుత్వంలో సామాన్య జనం కానుంచి రైతుల వరకు మంచి జరగబోతుందని పేర్కొన్నారు. రైతులకు కూడా 2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పిందని అది తప్పకుండా మా ప్రభుత్వం చేస్తుందని అందుకు ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి కూడా మొన్న మరోసారి గుర్తు చేయడం జరిగిందని చెప్పారు. నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం మట్టబోతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రజల మనిషని ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏసమస్య వచ్చిన నేను ఉన్నాననే భరోసా ఇచ్చే నాయకుడు మన జిఎంఆర్ అని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అదుకునే నాయకులు మన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

బిజినేపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. పల్లెలు అభివృద్ధి సాధిస్తే దేశం, రాష్ట్రం అభ్యున్నతి సాధిస్తుందని మాజీ సర్పంచ్ గంగారం అశోక్ అన్నారు.పోలేపల్లి గ్రామంలో ఆదివారం సుభాష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవలే పదవి విరమణ చేసిన సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో మార్పులు, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రతతో ముందుకు సాగడం జరిగిందని చెప్పారు. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో తన పదవి కాలాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. సుభాష్ యువజన సంఘం సీనియర్ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, త్రాగునీరు, వీధిలైట్లు, నిస్సహాయకులకు పింఛన్లు అందించి సర్పంచ్‌గా అశోక్ తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాణ డా. బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అట్టడుగు వర్గాలకు సైతం సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని గ్రామాల్లో నిస్వార్థంగా సేవ చేయాలన్న ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. తమ యువజన సంఘం తరపున సర్పంచ్, ఉపసర్పంచ్‌గా పదవి బాధ్యతలను పూర్తి చేసినందుకు సంఘం తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి సర్పంచ్ వసంత్‌కుమార్, శ్రీశైలం, పర్వతాలు, మన్యం అశోక్‌కుమార్, భానుప్రకాష్, శివ, మల్లేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ వసంత కుమార్లను సన్మానిస్తున్న యువజన సంఘం నాయకులు

పూసల్ పహాడ్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన..

నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాబోయే పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు పొందడానికి పూసల్ పహాడ్ టాలెంట్ టెస్టు ఎంతో ఉపయోగపడుతుందని పరీక్ష సమన్వయకర్త సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహ అన్నారు. ఆదివారం శేర్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పూసల్ పహా

ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దేముల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: దేవాదాయ, ధర్మదాయ శాఖ పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని శ్రీ మారుతి దేవాలయం, శ్రీ గోపాలక్రిష్ణ దేవాలయాలకు ధర్మకర్తల మండలి ఏర్పాటు (నూతన కమిటీల) కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఈఓ ప్రవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ ప్రవీన్ మాట్లాడుతూ నూతన కమిటి(ధర్మకర్తల మండలి) ఏర్పాటు చేయుటకు ఉపకమీషనర్ శాఖ ఆదేశించినట్లు తెలిపారు. ఆసక్తి కలవారు సహాయ కమీషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం బొగ్గులకుంట హైద్రాబాద్ నందు సంప్రదించాలని కోరారు.

యువతపైనే దేశ భవితవ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నందిగామ,ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: యువతపైనే దేశభవిష్యత ఆధారపడి ఉందని యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో గత 15 రోజులుగా జరిగిన ఎస్ఎస్పి ఎల్ 7 క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలైన క్రీడాకారుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం కోసం నందిగామ ఎంపిటిసి 1 యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రపాల్‌రెడ్డి నిర్వహించిన ఎస్ఎస్పి ఎల్ 7 క్రికెట్ టోర్నమెంట్ అభినందించదగిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో పూణే వారియర్ జట్టు కెప్టెన్ సందీప్ విజేతగా నిలిచి విన్నర్ కప్పు అందుకోగా బెంగళూరు జట్టు రన్నర్ కప్పుతో సరిపెట్టుకుంది. అదేవిధంగా నందిగామ విక్టరీ స్పోర్ట్స్ క్లబ్‌పై జయ కేతనం ఎగురవేసిన ప్రెస్ అండ్ పోలీస్ జట్టు కెప్టెన్ ఎర్ర రవికుమార్‌గౌడ్‌కు విన్నర్ కప్ అందజేశారు. ఈ వేడుకల్లో సిడబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్యే చల్లవంశీచందర్‌రెడ్డి మాజీ జెడ్పీటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, నందిగామ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ దేపల్లె కుమారస్వామి గౌడ్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిల్లెల్ల రాంరెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్

సిద్ధిపేట రూరల్(చిన్నకోడూరు), ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : చిన్నకోడూరు మండల కేంద్రంలో డ్రీమ్ లెవన్ టీమ్ సభ్యులు నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి శేఖర్, విఘ్నేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. గత 20 రోజులుగా 36 టీమ్‌లు తలపడగా ఫైనల్‌కు చేరిన మైలారం కమ్మర్లపల్లి, చిన్నకోడూరు టీమ్‌లు తలపడగా విన్నర్‌గా మైలారం కమ్మర్లపల్లి నిలువగా చిన్నకోడూరు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు త్రాజా మాజీ సర్పంచ్ కాముని ఉమేష్‌చంద్ర, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సీనియర్ క్రీడాకారులు హనుమయ్య, వార్డు మాజీ సభ్యులు ఇట్ట బోయిన శేఖర్, నాయకులు నిమ్మల వెంకటేశం, సామల అవినాష్, బీరయ్యల చేతుల మీదుగా విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.40 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.20 వేల నగదుతోపాటు కప్‌లను అందించారు. టోర్నమెంట్ నిర్వ హించిన ఏయ్య ప్రసాద్, గుడిసె పవన్‌లను అతిథులు అభినందించారు.

దళిత మహిళలను వివస్త్ర చేసినవారిని కఠినంగా శిక్షించాలి

పుర్రె ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఏరోళ్ల సంజీవయ్య

కొల్చారం, ఫిబ్రవరి11 ప్రభాతవార్త: దళిత మహిళలను వివస్త్రను చేసిన ఘటనలో దోషులకు జీవిత ఖైదు విధించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్రె ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఏరోళ్ల సంజీవయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన కొల్చారంలో ఎమ్మార్పీఎస్ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా మాచరెడ్డిలో రెండు రోజుల క్రితం దళిత మహిళను వివస్త్రను చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో దళితులపై ఎక్కడో ఒక చోట రోజూ దాడులు, వివస్త్రలు, అత్యాచారాలు జరుగుతున్నాయని మండి పడ్డారు. భారత దేశంలో ఇంత పెద్ద చట్టాలు ఉన్నప్పటికీ కూడా ఇలా చేయడం విడ్డూరమని, ఇలాంటి దుండగులను ఎప్పటికీ జైల్లోనే ఉంచాలని డిమాండ్ చేశారు.

అత్మూర్‌లో ముగిసిన సప్తహా-ఘనంగా శిఖర స్థాపన

-డిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డికి సన్మానం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: మండలంలోని అత్మూర్ గ్రామంలో వారం రోజులగా నిర్వహించిన సప్తహా భజన కార్యక్రమాలు సోమ వారంతో ముగిసాయి. సప్తహా ముగింపును పురస్కరించుకుని గ్రామంలోని ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్టాపన, శిఖర ప్రతిష్టాపన పూజలు వైభ వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాజీ మాజీ చైర్మన్ ఎం జైపాల్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న జైపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ బాధ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో శివస్వాములు, మల్చెల్మ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, న్యాల్‌కల్ మండల మాజీ జడ్పీటిసి సభ్యులు శివాజీ పాటిల్, మాజీ సొసైటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు ఏక్‌నాథ్‌పాటిల్, ఎంపిటిసి సభ్యులు పురుషోత్తంరెడ్డి, నాయ కులు వేణుగోపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, గోవింద్‌రావు, మోహన్, ఆఫ్సర్ దిల్‌దార్, శ్రీనివాస్, సాయిపాటిల్, దిలీప్,రాహుల్, పవన్, రమేష్, అనిల్ యాదవ్, సంగమేష్, అరుణ్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌లకు ఘనంగా వీడ్కోలు

మనూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: మండల కేంద్రంలో ఆదివారం ఆయా గ్రామాల తాజీ మాజీ సర్పంచ్‌లకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తాజా మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లా డుతూ గడిచిన 5 సంవత్సరాల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుజలో ఉండేందుకు సర్పంచ్‌లు అందించిన సహకారం, చేయూత అభినందనీయ మన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షే మానికి పాటుపడాల్సి న అవసరం ఉందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గానికి కొత్త అభివృద్ధి పనులు మంజూరు చేయించి పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు నాగేందర్‌రావు, మండల కో- ఆప్షన్ సభ్యులు సలీం, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు, ఎంపి టిసి సభ్యులు రాజు, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు నాగప్ప మాలిపటేల్, మాజీసర్పంచ్‌లు విఠల్‌రావు, శివాజీరావు, కవితారెడ్డి, రాజుపాటిల్, నర్సింలు, సంజీవ్, సిద్దు, సుధాకర్, పండరిముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు నూతన కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వుల జారీ

ఉద్దెమర్రిలోని శ్రీఅక్కన్న,మాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి (విష్ణు,శివ) ఆలయం దృశ్యం

శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

ఉద్దెమర్రిలోని శ్రీ అక్కన్న,మాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి (శ్రీవిష్ణు,శ్రీశివాలయం) దేవస్థానం ట్రస్టుబోర్డు నూతన కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024జనవరి 31వ తేదీన ఉత్తర్వులు జారీ అయిన విషయం ఆలస్యంగ వెలుగులోకి వచ్చింది. అయితే నాటి నుంచి 20రోజుల లోపు ట్రస్టు నూతన కమిటీ ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ప్రొప్రైర్మా ప్రకారం దేవాదాయ శాఖ సూచనల మేరకు ప్రతిపాదనలు సంబంధితశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలోని శ్రీఅక్కన్న, మాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. శ్రీఅక్కన్న, మాదన్నలు నిర్మించిన ఈ దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతిష్టించటం నిత్యపూజలు అందుకోవటం జరుగుతుంది. కొన్నేళ్ల నుంచి శ్రీవేంకటేశ్వరస్వామికి నిత్య పూజలు, ప్రతి ఏటా ఉత్సవాలు, కల్యాణోత్సవం నిర్వహించటం జరుగుతుంది. పూర్వం నుంచి ఉన్న ఈ దేవాలయానికి చారిత్రాత్మక మంచి చరిత్ర ఉంది. దేవాదాయ,ధర్మాదాయ శాఖ నుంచి ఉద్దెమర్రిలోని శ్రీఅక్కన్న,మాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి ఏటా ట్రస్ట్ నూతన కమిటీ ఏర్పాటు (నామినేట్) దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే 2024జనవరి 31వ తేదీన ఉద్దెమర్రిలోని ఈ దేవాలయానికి నూతన ట్రస్ట్ బోర్డు కమిటీని ప్రభుత్వం (దేవాదాయశాఖ) నియమిస్తుందని ఆసక్తి ఉన్న వారు ట్రస్టీ చైర్మన్,సభ్యుల పదవుల కోసం 20రోజుల్లో ధరఖాస్తులు చేసుకోవాలని నిబంధనలు,చట్ట ప్రకారం ప్రొర్మా ఆదారంగ 20రోజుల లోపు పేర్లు డిప్యూటీ కమిషనర్‌కు లేదా అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి జిల్లా బొగ్గులకుంటకు పంపాలని దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ నుంచి ఉత్తర్వులు (నోటీసులు) జారీ అయ్యాయి. అయితే ప్రస్తుతం ఉన్న శ్రీఅక్కన్నమాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్, కమిటీ పాలకవర్గం కొనసాగుతుంది. అయితే ప్రస్తుత ట్రస్ట్ కమిటీ ఈ దేవాలయ పాలక వర్గం (ట్రస్టీ కమిటీ) చైర్మన్,సభ్యుల పదవీకాలం ముగింపు 2024 మే15వ తేదీ వరకు ఉన్నప్పటికీ, ముగింపునకు మరో మూడు నెలల పాటు గడువు ఉన్నట్లు, గడువు ఉన్నా ఈ దేవాలయానికి నూతన కమిటీ ట్రస్టీ ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేయటం సందిగ్దంగ మారింది. ప్రస్తుత ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి ఈ విషయంపై పేర్కొంటూ తమ కమిటీకి మరో మూడు నెలల గడువు ఉందని, మరీ నూతన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడినట్లు ఇదీ ఎంత వరకు సబబు అని అయోమయంగ ఉందని అన్నారు. దేవాలయ అభివృద్ధికి ఆహోర్నిశలు అందరి సహకారంతో కష్టపడి పనిచేసినట్లు ఉద్దెమర్రి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. మరీ రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని చేస్తున్నారా..లేక ఏమి తెలియకుండ అర్థం కాకుండ ఉందని అన్నారు. ఇదీ ఇలా ఉండగ మరీ ఇతర దేవాలయాల కమిటీల పదవీకాలం ముగిసినా నూతన కమిటీ ఏర్పాటుకు మరీ ఉత్తర్వులు జారీ కాలేదని దీనిలో మతలబు ఏమిటని అర్థం కాకుండ ఉందని పలువురు వాపోతున్నారు. దేవాదాయశాఖ సంబంధిత అధికారులను ఈ విషయంపై అడిగితే మాత్రం ఉత్తర్వులు జారీ అయినట్లు ఏమి చేయలేమని అంటున్నారని సమాచారం.

అయితే ప్రస్తుత కమిటీ చైర్మన్, సభ్యులు ఈ విషయంపై మాత్రం న్యాయస్థానంను ఆశ్రయించవచ్చని సమాచారం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ట్రస్ట్ కమిటీకి నూతనంగ కొన్ని పేర్లు పంపటానికి కసరత్తులు కూడ చేస్తున్నట్లు తెలుస్తుంది. గత రెండేళ్ల నుంచి పరిశీలిస్తే మాత్రం శ్రీఅక్కన్న,మాదన్నల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, విష్ణు, శివుని ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. ఉద్దెమర్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి ట్రస్ట్ నూతన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల జారీ విషయం గ్రామంలో అందరిలోనూ (రాజకీయంగ) చర్చనీయాంశంగ మారింది.

కష్టపడి చదివితే లక్ష్యాలను సాధించవచ్చు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర ఫిబ్రవరి 11: ప్రభాతవార్త:

కష్టపడి చదివితే లక్ష్యాలను సాధించవచ్చునని స్థానిక శాసనసభ్యురాలు వాటికి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఎస్‌డిఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, కాలేజీ బ్యాగ్‌లు, స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యాక్రమానికి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతై విద్యాబివృద్ధికి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని, దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులలో రాణించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో జడ్పీటిసి అంజనేయులు, ఎంపిపి నర్సింలు, సంస్థ డైరెక్టర్ మోహమ్మద్ అజామ్‌ఖాన్, రసూల్‌ఖాన్, స్థానిక బిఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ రామాయంపేటకు అవార్డులు

రామాయంపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంట ర్నేషనల్ 320 డి లో భాగమైనటువంటి ఎక్సలెన్స్ రీజియన్ 5 కాన్ఫ రెన్స్ అవార్డ్స్ ప్రోగ్రాం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్‌లో శనివారం సాయం త్రం వరకు జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రామాయంపేట స్నేహబంధ చేసిన పలు సేవా కార్యక్రమాలకు 3 అవార్డులు అందుకో వడం జరిగింది. ఈ అవార్డ్స్‌లో భాగంగా ఉత్తమ సేవా కార్యక్రమాలు చేసినటువంటి పలు సేవ కార్యక్రమాలకు కలిపి మూడు అవార్డులు సొం తం చేసుకుంది. అవార్డులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు, రీజియన్ చైర్‌పర్సన్ గుడాల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామాయం పేట స్నేహబంధు లయన్స్ క్లబ్ సభ్యులందరు పాల్గొన్నారు. సభ్యులతో పాటు జోన్ చైర్మెన్ ఐరేని రవీందర్‌గౌడ్‌కు బెస్ట్ జోన్ చైర్మెన్ అవార్డు, బెస్ట్ డి.సి. గా ఎం దీప్‌చంద్‌కు మరియు కోశాధికారిగా గడ్డం గంగారాం కు ప్రత్యేక బహుమతులు లభించాయి. ఈకార్యక్రమంలో వీరితోపాటు డి.సి. వి.దామోదర్‌రావు, కే. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

మునిపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం మండలంలోని తక్కడపల్లి కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్, మండల కోశాధికారి నాయకుడి సంగన్న, ఎస్ఎంసి చైర్మన్ గొల్ల శ్రీనివాస్, మైనార్టీ గ్రామ అధ్యక్షులు అఫ్సర్‌మియా, మాజీ సర్పంచ్ కపాటి సంగన్న, కాంగ్రెస్ నాయకులు గొల్ల దత్తు,గోదారం సంగన్న, నాయికోటి సంగన్న పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ అందుకున్న తండ్రి కొడుకులు

చేర్యాల,ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : 108 సూర్య నమస్కారాలు చేసి తండ్రి కొడుకులు గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆదివారం వ్యాస మహర్షి యోగా సొసైటీ వారి ఆధ్వర్యంలో సిద్ధిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో నిర్వహించిన ఈ పోటీల్లో చేర్యాల పట్టణానికి చెందిన బూనాద్రి కిషన్‌తో పాటు తన పెద్ద కుమారుడు బూనాద్రి మణిదీప్ గోల్డ్ మోడల్ అందుకోగా చిన్నకుమారుడు అక్షిత్ సిల్వర్ మోడల్ అందుకున్నాడు. అనంతరం వ్యాస మహర్షి వారు వారిని సత్కరించి సర్టిఫికెట్ అందించారు.

సిద్ధిపేట స్వచ్ఛ బడి ఒక పుస్తకం

మున్సిపాలిటీ అధికారుల పనితీరు భేష్

సిద్ధిపేట రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: జిల్లాలో 5 రోజులుగా పర్యటిస్తున్న సెంట్రల్ సెక్రటేరియట్ సెక్షన్ అఫీసర్స్ 14 మంది బృందం ఆదివారం సిద్ధిపేట పట్టణంలో పర్యటించారు. సిద్ధిపేట పట్టణంలోని స్వచ్ఛబడి, మున్సిపల్ కార్యాలయం, మార్కెట్, సివియేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, బుస్సాపూర్ డంపింగ్ యార్డు,డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు మున్సిపల్ అడి షనల్ కమిషనర్ మల్లికార్జున్ సిద్ధిపేట స్వచ్ఛ బడిలో సిద్ధిపేట అభివృద్ధిని ప్రొజెక్టర్ ద్వారా క్షుణంగా వివరించారు. స్వచ్ఛ బడిలో తెలుసుకున్న విషయాలకు, స్వచ్ఛబడిని సందర్శించడం సంతోషంగా ఉందని కేంద్ర అధికారుల బృందం కితాబిచ్చారు. సిద్ధిపేట స్వచ్ఛబడి ఒక పుస్తకం లాంటిదన్నారు. సిద్ధిపేటలో పర్యటించడం సంతోషంగా ఉందన్నారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్ దీప్తి నాగరాజు, డిఆర్‌డిఎ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్నూర తహసీల్దార్, ఎంపిడిఓ బదిలీ

హత్నూర, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : ఎంపిడిఓ శారదాదేవి, తహసి ల్దార్ సంధ్యలు బదిలీ అయ్యారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టి లో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తహసిల్దార్,ఎంపిడిఓల బదిలీల లో భాగంగా జరిగినట్లు అధికారులు పెర్కొంటున్నారు. శాసనసభ్య ఎన్ని కలముందు వచ్చిన తహసిల్దార్ సంధ్య వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. 2 సంవత్సరాలపాటు పనిచేసిన ఎంపిడిఓ శారదాదేవి నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు.

ఫయాజ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

సంగారెడ్డి ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: జహీరాబాద్‌పట్టణంలోని ఫయాజ్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను ఆదివారం కాంగ్రెస్ నాయకులు గౌసొద్దిన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను మాజీ మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాలనీ వాసులకు అందేలా కృషి చేయాలని కాలనీ నాయకులకు సూచిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్

సిర్గాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: సిర్గాపూర్ పోలీసు ఠాణాలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌గౌడ్ ఏఎస్ఐగా పదో న్నతి పొందారు. నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి వెంకట్‌రెడ్డి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన రవీందర్‌గౌడ్‌కు సింగిల్ స్టార్ తొడిగి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బిజెపి మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ పాటిల్

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులుగా రాజశేఖర్‌పాటిల్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ బాధ్యతలు అందుకున్న రాజశేఖర్‌పాటిల్ మాట్లా డుతూ తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, అందుకు సహకరించిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప,నారాయణఖేడ్ అసెంబ్లి కన్వీనర్ రజనీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మునిపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ చేసి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ రెసిడెన్షియల్ కళాశాలకు కేటాయించిన స్థలాలను పూర్తి సర్వే చేసి బౌండరీలు నిర్మించాలన్నారు. అదనపు గదులు, మరమ్మత్తులు, ప్రహారి గోడ, గేటుల ఏర్పాటుకు, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులు సూచించారు. కంకోల్‌లో 2.50 కోట్ల రూపాయలతో కొత్తగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి శంకుస్థాపన చేశారు. పిహెచ్‌సి ఏర్పాటుతో 16 గ్రామాల ప్రజలు వైద్యం అందుకోగలుగుతారన్నారు. దసరా పర్వదినం లోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తే డాక్టర్లు, నర్సులు, సిబ్బందిని నియమించు కుందామన్నారు. పెద్దచెల్మెడలో 4.35 కోట్లతో నిర్మించనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. తాటిపల్లిలో కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో 37లక్షల రూపాయలతో చేపట్టనున్న రూఫ్, బాత్‌రూంల నిర్మాణానికి శంకుస్థాపన చేశారరు. కార్యక్రమంలో డిఇఓ వెంకటేశ్వర్లు, టిఎస్ఈ డబ్ల్యు ఐడిసి ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డిఓ రవీదర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రి దేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంపిపి, జడ్పీటిసి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లూరు బండ క్షేత్రం మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

సిద్ధిపేట రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :

పుల్లూరు నరసింహ స్వామి గొప్ప మహిమన్వా హితం కలిగినదేవుడని..పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం చాలా గొప్పదని ఇక్కడ నరసింహ స్వామి స్వయంగా వెలిశాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు.సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ బండజాతర ఉత్సవా లలో భాగంగా ఆయన అదివారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లూరు బండ క్షేత్రాన్ని రూ.మూడున్నర కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయించి దేవాలయాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేస్తామ న్నారు. పుల్లూరు బండ క్షేత్రాన్ని పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో 459 అలయాల్లో ఉన్న పూజారులకు దూప దీప నైవేద్యం కింద రూ.6 వేల నుంచి 10 వేలకు పెంచమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్చకులకు జీతాలు లేవు..దూప దీప నైవేద్యం కింద రూ.12 వేలు ఇస్తామని చెప్పారు కానీ అమలు చేయడంలేదన్నారు. అసెంబ్లీలో దూప దీపనైవేద్యం కింద కాంగ్రెస్ ప్రభు త్వం ఇస్తామన్న రూ.12 వేలు ఇవ్వాలని మాట్లాడతా నని తెలిపారు.

6 నెలల వేతనాలు వెంటనే చెల్లిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకు ముందు సిద్దిపేటలో కెసిఆర్ సీజన్-3 క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు హరీష్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే సిద్దిపేటలో అదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీల